క్లుప్తంగా

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు



జనరల్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి పిట్టా రాంరెడ్డి

భానుపురి : వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి ఆధ్వర్యంలో సూర్యాపేట నియోజకవర్గంలో ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని జనరల్ ఆస్పత్రిలో వృద్ధులకు, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిశీలకులు బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి, స్టేట్ యూత్ కోఆర్డినేటర్ లోడంగి గంగాధర్ యాదవ్, జిల్లా నాయకులు గోరంట్ల సంజీవ, ఎండీ రఫీ, పిప్పాల సతీష్, నాతాల అనంతరెడ్డి, పిడమర్తి ప్రశాంత్, ఇరుగు శాంతి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న భిక్షం

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని మక్త కొత్తగూడెంలో ఆదివారం అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన డాక్టర్ తిప్పర్తి భిక్షం గ్రామంలో సుమారు 60 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఏఎస్ఐ

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ దారా వెంకటరత్నం–చంద్రకళ దంపతులు ఆదివారం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక రక్షకుడైన క్రీస్తు పుట్టిన రోజు పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ యేసురత్నం, క్రైస్తవులు యశోద, కమలమ్మ, ప్రమీల, లింగమ్మ, వెంకటమ్మ, పద్మ, కావేరి, కీర్తన, కళమ్మ, రజిత, కాశయ్య, బాచి పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా విష్ణు



తిరుమలగిరి : అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన కందుకూరి విష్ణును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీ హాల్‌లో అంబేద్కర్ యువజన సంఘం సభ్యుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాములు, కె.సోమయ్య, లక్ష్మయ్య, కె.శ్రీను, నాగార్జున్, నరేష్ పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు



దేవతామూర్తులను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నూతనకల్ : దిర్శనపల్లి గ్రామంలో తిరపతమ్మ తల్లి దేవతామూర్తుల విగ్రహాలను ఆదివారం ఘనంగా ఊరేగించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించనున్న సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు. వేడుకల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే



నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ల కోసం పోరాడిన నకారా చిత్రపటానికి విశ్రాంత ఉద్యోగుల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఆర్.సీతారామయ్య, శ్రీనివాసరావు, సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య, వరప్రసాద్, భిక్షం పాల్గొన్నారు.

అధ్వానంగా లింక్ రోడ్లు

- జాజిరెడ్డిగూడెం మండలంలో కనీస మరమ్మతులకు నోచుకోని పలు గ్రామాల అనుసంధాన రహదారులు
- రోడ్లను అభివృద్ధి చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజల వేడుకోలు



రామన్నగూడెం-కుంచమర్తి మధ్య లింక్‌రోడ్డు



కాసర్లపహాడ్-వేల్పుచెర్ల దారి..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల అనుసంధాన రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లింక్ రోడ్లు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. పక్కా రోడ్లను ఏర్పాటు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని అధికారులను మొరపెట్టుకుంటున్నారు. కానీ ఏళ్లుగా గుడస్తున్నా గ్రామాల్లో లింకు రహదారులకు మోక్షం కలగడంలేదు.

20కిపైగానే లింక్ రోడ్లు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్ గ్రామం నుంచి వేల్పుచెర్ల, మర్రిబాయి తండాలకు వెళ్లే అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. అలాగే రామన్నగూడెం–కుంచమర్తి మధ్య లింక్‌రోడ్డు కంపచెట్లతో నిండి బురదమయంగా మారింది. జాజిరెడ్డిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లే లింక్ రోడ్డు కూడా ఇలాగే మారింది. కొత్తగూడెం గ్రామస్తులు ఉపాధిహామీ కూలీ డబ్బులు, పింఛన్ల కోసం ప్రతినెలా జాజిరెడ్డిగూడెం వెళ్తుంటారు. ఈదారి కంపచెట్లతో నిండి గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే అడివెంల నుంచి తిమ్మాపురం వెళ్లే లింక్ రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. ఈదారి వెంట రైతులు, విద్యార్థులు వెళ్తుంటారు. తిమ్మాపురం నుంచి కందగట్లకు వెళ్లే లింక్ రోడ్డు, అడివెంల నుంచి కోమటిపల్లికి, కుమ్మరిగూడెం గ్రామానికి వెళ్లే లింక్‌రోడ్డు, కోడూరు నుంచి తాళ్లసింగారం గ్రామానికి, కొమ్మాల నుంచి మర్రిబాయితండా, మేడిబాయితండాలకు, జాజిరెడ్డిగూడెం నుంచి పర్సాయపల్లికి, బొల్లంపల్లి నుంచి పర్సాయపల్లికి వెళ్లే రోడ్లతోపాటు వివిధ గ్రామాల్లో అనేక లింక్‌రోడ్లు కంపచెట్లతో నిండి, గుంతలమయంగా మారాయి. ఈ రహదారులు సరిగా లేక ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుండటంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు స్పందించి ఈ లింక్ రోడ్లను పక్కా రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నాం



కుంచమర్తి నుంచి రామన్నగూడేనికి వెళ్లే లింక్‌రోడ్డు కంపచెట్లతో నిండి నడిచి కూడా వెళ్లలేని విధంగా మారింది. ఈదారిలో ఐదారు గ్రామాల ప్రజలు, రైతులు వెళ్తుంటారు. దారి సరిగా లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో వ్యయప్రయాసలకు లోనవుతున్నాం.

– ఎస్‌కె.సయ్యద్, కుంచమర్తి

పక్కా రోడ్డుగా మార్చాలి



కొత్తగూడెం నుంచి జాజిరెడ్డిగూడెం వెళ్లే లింక్‌రోడ్డును పక్కారోడ్డుగా మార్చాలి. ప్రతి నెలా పింఛన్లు, ఉపాధిహామీ పథకం కూలీ డబ్బులు, ఇతర పనుల కోసం జాజిరెడ్డిగూడెం వెళ్లాల్సి ఉంటుంది. ఈ లింక్‌రోడ్డు సరిగా లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం.

– రామసాని రవీందర్, కొత్తగూడెం

కనులపండువగా కావడి మహోత్సవం



శోభాయాత్ర నిర్వహిస్తున్న సభ్యులు, భక్తులు

భానుపురి : పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా పాల కావడి మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య సమేత శ్రీవల్లి శివ విగ్రహాలతో పాటు పాలకావడిల శోభాయాత్ర చేపట్టారు. అనంతరం శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు రెంటాల సతీష్ శర్మ మాట్లాడారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా దేవాలయంలో మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదటి రోజు ఆదివారం పాల కావడి మహోత్సవాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ నెల 18న ఉదయం ఏడు గంటలకు స్వామి అమ్మవార్లకు అభిషేకం, 10 గంటలకు సుబ్రహ్మణ్య శ్రీవల్లి దేవసేన కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాతృవంశ, పితృవంశ దోష నివారణకు కర్ణాటకలో నిర్వహించే అశ్లేష బలిపూజ సర్ప బలిహరణ ఉంటుందని తెలిపారు. వివాహం కాని, సంతానం లేని స్త్రీ పురుషులకు ప్రత్యేకంగా రాత్రి 7 గంటలకు సర్వకార దీపోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. 19న నారాయణ బలి పూజ, సుబ్రహ్మణ్య యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న హమాలీ నాయకులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన హమాలీ సంఘం నాయకుడు, ఆటో డ్రైవర్ కొమారి భిక్షం ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో స్థానిక లక్ష్మీనర్సింహ హమాలీ సంఘం ఆధ్వర్యంలో రూ. 10వేలు, స్థానిక సిమెంట్, ఐరన్ దుకాణాల ఆధ్వర్యంలో రూ. 11వేలు, ఫెర్టిలైజర్స్ దుకాణాల ఆధ్వర్యంలో రూ. 4వేల చొప్పున మొత్తం రూ. 25వేల ఆర్థికసాయాన్ని ఆదివారం మృతుడి కుటుంబీకులకు అర్వపల్లి హమాలీ సంఘం అధ్యక్షుడు సాయిని కృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బైరు రాంబాబు, కొమారి మహేష్, మామిడి సైదులు, కొమారి నాగరాజు, డి. యాకస్వామి, ఎం. సంతు, ఎం. కిరణ్, బి. సురేష్, కె. మల్లేష్, ఎస్. రాము, ఎం. శ్రీను, ఎం. సురేష్, బి. వెంకన్న, ఉమేష్, శేషు, గణేష్, ఎం. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రేడియం స్టిక్కర్ల పంపిణీ



ఫణిగిరిలో ఎడ్లబండ్లకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగారం : సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ఫణిగిరి గ్రామ శివారులో నిత్యం ఎడ్ల బండ్లకు వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతుంటడంతో ఆ ప్రమాదాలను నివారించేందుకు ఫణిగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం రైతులకు రేడియం స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాట్లాడారు. రాత్రి వేళల్లో ఎడ్ల బండ్లు కనిపించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో రైతులకు రేడియం స్టిక్కర్లను అందించామని అన్నారు. ఫణిగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నాగు వెంకన్న, ఆలకుంట్ల బాలకృష్ణలు రేడియం స్టిక్కర్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాతి వీరమల్లు, రాంరెడ్డి, మందుల వెంకన్న, బత్తుల కర్ణాకర్, యాట భాస్కర్, రావుల సత్తయ్య, అవిలయ్య, కల్లెట్లపల్లి రమేష్, వల్లాల రామయ్య, జాన్‌వెస్లీ, శేఖర్‌రెడ్డి, నాతి వెంకన్న, జంపాల రవి, గట్టు లక్ష్మీకాంత్, మహేష్, మల్లయ్య, నరేష్, ఎల్లయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి మంచి స్పందన



అర్వపల్లిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వీరప్రసాద్, సోమేష్‌గౌడ్

అర్వపల్లి : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ జన్మదినం సందర్భంగా అర్వపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు. అలాగే మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, మొరిశెట్టి ఉపేందర్, బొడ్డు రామలింగయ్యయాదవ్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, చిల్లంచర్ల విద్యాసాగర్, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, పందిరి యుగేందర్, అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, కడారి నరేష్‌యాదవ్, బందెల అర్వపల్లి, గోసుల విజయ్, వల్లపు గంగయ్య, పొట్టిపాక సైదులు, దుబ్బాక యల్లంరాజు, పులిచర్ల ప్రభు, కమటం రాజు, మామిడాల రాజలింగం, ఎంపీటీసీ బిక్కునాయక్, సంజీవ్‌నాయక్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల కలశాల శోభాయాత్ర



జాజిరెడ్డిగూడెంలో కలశాలతో భక్తులు

అర్వపల్లి : అయోధ్య రామ్‌లల్లా మందిర ప్రాణ ప్రతిష్ఠ అక్షింతల కలశాల శోభాయాత్రను ఆదివారం రాత్రి అర్వపల్లి నుంచి జాజిరెడ్డిగూడెం వరకు నిర్వహించారు. శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలశాలకు జాజిరెడ్డిగూడెంలోని దేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో శోభాయాత్ర సంయోజకులు శాగంటి నాగరాజు, మన్సూరు యాదగిరి, దాసరి సోమయ్య, స్వాములు, డాక్టర్ జెరిపోతుల లక్ష్మణ్, గజ్జి శంకర్, పాల్వాయి లింగమల్లు, కనుకు బద్రి, సురేష్, బాసాని సత్తయ్య, శ్రీరామ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలందరినీ తప్పనిసరిగా బడికి పంపాలి



అర్వపల్లి : సంచారజాతి కుటుంబాల వద్ద సర్వే చేస్తున్న సీఆర్‌పీ జానయ్య

అర్వపల్లి : బడి ఈడు, బడి మధ్యలో మానేసిన పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపాలని జాజిరెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల క్లస్టర్ సీఆర్‌పీ ఉల్లెందుల జానయ్య కోరారు. బడి బయట పిల్లల గుర్తింపునకు ఆదివారం మండల పరిధిలోని అర్వపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో చేర్పించనున్నట్లు తెలిపారు.

మొక్కులు చెల్లించిన కాంగ్రెస్ నాయకులు



ఆలయంలో మొక్కులు తీర్చుకున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం భద్రాచలంలోని సీతా రామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మందుల సామేలు గెలుపుకోసం స్వామి వారికి మొక్కుకున్నట్లు తెలిపారు. అనుకున్న విధంగా జరగడంతో మొక్కులు తీర్చుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమ్మల నిరంజన్, మామిడి విజయ్‌కుమార్, మామిడి నాగరాజు, కుంభం రవీందర్, యల్మకంటి యాదగిరి, గీస సురేష్, దడిగెల శేఖర్, మామిడి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం హర్షణీయం

మునగాల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మునగాల మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలు గ్రామాల్లో నేటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ పథకం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, ఉపసర్పంచ్ రావులపెంట బ్రహ్మం, సింగిల్ విండో డైరెక్టర్ నిడిగొండ శంభయ్య, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వట్టెపు చినసైదులు, ములకపల్లి సైదులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ స్కూళ్లలో 'సోలార్' వెలుగులు

- జాజిరెడ్డిగూడెం మండలంలోని రెండు పాఠశాలల్లో సోలార్ ప్యానళ్ల ఏర్పాటు
- తగ్గుతున్న విద్యుత్ బిల్లుల భారం
- మిగతా పాఠశాలల్లోనూ ఏర్పాటు చేయాలని కోరుతున్న హెచ్ఎంలు



సౌర యూనిట్ ఏర్పాటు చేసిన తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల



పాఠశాల భవనంపై బిగించిన సోలార్ ప్యానల్

అర్వపల్లి : సర్కార్ బడులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ బడులకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని శాశ్వతంగా లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకుగాను విడతల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌర యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. టీఎస్ రెడ్‌కోతో కలిసి ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తోంది. ఈ బాధ్యతను టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు అప్పగించింది. ఎంపికై న పాఠశాలల్లో సోలార్ విద్యుత్ నిర్వహణను విజయవంతంగా అమలు చేస్తున్నారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో కూడా సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అర్వపల్లి, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లలో..

జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో 2 కిలోవాట్ల సౌర పలకలు, బ్యాటరీలను రూ.98 వేల ఖర్చుతో ఏర్పాటు చేశారు. గత ఐదు నెలల నుంచి సోలార్ విద్యుత్ పైనే ఈ పాఠశాలల్లో విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈ సౌర విద్యుత్‌తో పాఠశాలల్లో కరెంట్ కోత సమస్య తీరింది. ముఖ్యంగా కంప్యూటర్ పనులకు ఆటంకం తీరింది. అలాగే డిజిటల్ విద్యాబోధనకు కరెంట్ కోతల సమస్య తప్పింది. విద్యుత్ బిల్లులు కూడా తగ్గాయి.

విద్యుత్ బిల్లుల భారం తొలగింది



మా పాఠశాలలో 165 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. దీంతో కరెంట్ వాడకం ఎక్కువగా ఉంటుండటంతో బిల్లు ఎక్కువగా వస్తోంది. సోలార్ ఏర్పాటు చేయడం వల్ల ఈ ఇబ్బంది తీరింది. సోలార్ ఏర్పాటు చేయకముందు నెలకు రూ.800 బిల్లు రాగా ప్రస్తుతం రూ.150 నుంచి రూ.190 వరకు వస్తోంది.

– డి.చాంప్లానాయక్, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, తిమ్మాపురం

ప్రభుత్వ పాఠశాలలకు ఉపయోగకరం



సోలార్ యూనిట్లు మండలంలోని అర్వపల్లి, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లకు మంజూరు కాగా ఏర్పాటు చేశాం. ఐదు నెలల నుంచి సోలార్ విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో ఆ పాఠశాలలపై బిల్లుల భారం తగ్గిపోయింది. అలాగే పిల్లలకు డిజిటల్ బోధనకు కరెంట్ ఇబ్బంది తీరింది. సోలార్ విద్యుత్ పాఠశాలలకు ఎంతో ఉపయోగకరం.

– వి. శ్రీకాంత్, డిస్కం ఏఈఈ

మార్కెట్ యార్డుకు సిబ్బంది కొరత

- ప్రస్తుతం నలుగురే రెగ్యులర్ ఉద్యోగులు
- పని భారంతో ఇబ్బందులు



తిరుమలగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం

తిరుమలగిరి : ఆదాయ పరంగా జిల్లాలోనే రెండవ స్థానం ఆక్రమించిన తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్‌లో 13 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు సూర్యాపేట జిల్లా నుంచే కాకుండా యాదాద్రి భువనగిరి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా ప్రతి రోజు సరుకులు వస్తుంటాయి. సంవత్సరం పొడవునా క్రయ, విక్రయాలు సాగుతుంటాయి. జిల్లాలోనే ప్రధాన మార్కెట్‌గా ఆవిర్భవించిన తిరుమలగిరి మార్కెట్‌లో సిబ్బంది కొరత తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ కమిటీ సెక్రటరీ, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు.

ఖాళీలు వివరాలు ఇలా..

వ్యవసాయ మార్కెట్‌లో ఒక అసిస్టెంట్ సూపర్‌వైజర్ (ఏఎంఎస్), ఒక గ్రేడర్, ఒక టైపిస్టు, ఒక బిడ్ క్లర్క్, ఇద్దరు జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు, ఇద్దరు వాచ్‌మెన్లు ఉండాల్సి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ యార్డుకు సిబ్బంది కొరత వేధిస్తున్నా ఆదాయం సాధించడంలో మాత్రం అవరోధం కలుగ లేదు. ప్రతి సంవత్సరం మార్కెట్ యార్డుకు రూ.2 కోట్లకు పై చిలుకుగానే ఆదాయం వస్తోంది. అయితే సిబ్బంది కొరత వల్ల అదనపు భారం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



జాజిరెడ్డిగూడెంలోని దేవాలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా భక్త బృందంచే భజనలు, కోలాట బృందాలచే ఊరేగింపు జరిపారు. అలాగే మహిళలు మంగళహారతులతో ఆలయానికి వచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంచేందుకే టాలెంట్ టెస్ట్‌లు



పరీక్ష పేపర్‌ను విడుదల చేస్తున్న సీఐ రాము, మేకల శ్రీనివాసరావు

కోదాడఅర్బన్ : పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని కోదాడ పట్టణ సీఐ టి.రాము, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు మేకల శ్రీనివాసరావు, ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని వారు విడుదల చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు అవగాహన పెంచేందుకు ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. విద్యార్థులు రానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలని వారు కోరారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌లు మాట్లాడారు. ఈ టెస్ట్‌లో మొత్తం 736మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. టాలెంట్‌టెస్ట్‌లో విజేతలకు త్వరలోనే బహుమతులు అందజేస్తామన్నారు. నందిని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుంగతుర్తి : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈఈ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తిలోని 132/133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా తుంగతుర్తి, వెలుగుపల్లి, రావులపల్లి, అన్నారం, రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

మోతె ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా హరిసింగ్‌నాయక్



మోతె : మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మండలంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న హరిసింగ్‌నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు శనివారం జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశా రు. దీంతో హరిసింగ్‌నాయక్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

వడ్డెర సంఘం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా వీరస్వామి

మోతె : కోదాడ నియోజకవర్గ వడ్డెర సంఘం యూత్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన తుర్క వీరస్వామి ఆదివారం ఎన్నికైనట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేముల వీరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడారు. వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొంత సురేష్, వల్లపు సైదులు, శివరాత్రి వెంకటేశం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని వేణుగోపాలపురంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. వేణుగోపాలపురం గ్రామానికి చెందిన చందా శ్రీను తన ఆవును ఆదివారం గ్రామ సమీపంలో మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆవు మేత మేసుకుంటూ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలింది. దీంతో ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. మృతి చెందిన ఆవును గ్రామసర్పంచ్ గంధమళ్ల స్వరూప సందర్శించారు. బాధితుడికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.